క్లుప్తంగా

వైద్య పరీక్షలు



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు పుట్టుకతో వచ్చే వ్యాధులు, ఆరోగ్య సమస్యలు, పెరుగుదల లోపాలను పరిశీలించారు. సమస్యలు ఉన్న విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు విద్యార్థులను నిజామాబాదు ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. వైద్యులు నిఖిత్, కాంతి, ఫార్మసిస్టు ఉమారాణి, స్వప్న, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శారద శిశుమందిర్‌లో..



రాజంపేట: మండల కేంద్రంలోని శారద శిశుమందిర్ పాఠశాలలో బుధవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విద్యార్థులకు పరిశుభ్రత, హెల్త్ న్యూట్రిషన్ గురించి వివరించారు. వైద్యులు హరీశ్‌గౌడ్, దివ్యభారతి, మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు నాటాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో తప్పనిసరిగా ప్రతి ఏడాది ఐదు మొక్కలను నాటాలని ఎంపీడీవో అనంత్‌రావు అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరు మండలం సిద్ద రామేశ్వరనగర్‌లోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో పండ్ల, పూల మొక్కలు కూడా ఉన్నాయని, ప్రజలు వీటిని ఇళ్లలో నాటుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సౌజన్య ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో ఉన్న పోలింగ్ బూత్‌లను బుధవారం ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్దుర్ చిపాంగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిధిలో గల ఓటర్ల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులపై ఆరా తీసి ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం భక్తులు విరాళాలను అందజేశారు. బుధవారం అన్నారం గ్రామానికి చెందిన రంగిని వెంకట్రావు రూ.11 వేలు, పెద్ద కొడప్‌గల్ మండలానికి చెందిన అంబర్ సింగ్ రూ.11 వేలు, రెంజల్ గ్రామానికి చెందిన కిష్టాగౌడ్ రూ.5 వేలు, సర్పంచ్ బాల్‌రాజ్ రూ.5 వేల నగదును ఆలయ నిర్వాహకులు తేజ స్వామికి అందజేశారు. అంతకు ముందు వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై కోనారెడ్డి సూచించారు. బుధవారం జగన్నాథ్‌పల్లి చౌరస్తాలోని 161 జాతీయ రహదారి సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రం నుంచి ప్రధాన రహదారికి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వాహనాల్లో అక్రమంగా మద్యం, రూ.50 వేలకు మించి నగదు, బంగారం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసీఆర్ గెలిస్తే మరింత అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం



క్యాసంపల్లిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి రూరల్: సీఎం కేసీఆర్ కామారెడ్డిలో గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి, రాఘవాపూర్, క్యాసంపల్లి తండా, క్యాసంపల్లి, నర్సన్నపల్లి, కోటాల్‌పల్లి, లింగాయిపల్లి గ్రామాల్లో సీఎం కేసీఆర్ తరఫున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సహాయం చేయాలన్న ఆలోచన ఏ ప్రభుత్వానికి రాలేదని, రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి అందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే ఆసరా పింఛన్లు పెరుగుతాయని, రైతుబంధు సాయం పెరుగుతుందని తెలిపారు. సిమెంట్ సలాకలు ఇచ్చే నాయకుడు కావాలా అభివృద్ధి చేసే సీఎం కావాలా ఆలోచించాలని కోరారు. ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, మాజీ జెడ్పీటీసీలు గోపిగౌడ్, నిమ్మ మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు జూకంటి సుమిత, మీరి, సందిరి మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేడు భిక్కనూరులో ప్రభుత్వ విప్ పర్యటన

భిక్కనూరు: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం భిక్కనూరులో పర్యటిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. ఎన్నికల ప్రచారం చేస్తారని చెప్పారు.

కేసీఆర్ బావ ప్రచారం..

దోమకొండ: సీఎం కేసీఆర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రముఖ న్యాయవాది, కేసీఆర్ బావ రామారావు అన్నారు. బుధవారం అంబారిపేటలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొలమద్ది రాజేందర్, గ్రామ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



మాచారెడ్డి/కామారెడ్డి క్రైం: మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మారెడ్డి, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. బుధవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డిలు ఉన్నారు.

లక్ష మెజార్టీతో గెలిపించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి



2వ వార్డు రామేశ్వరపల్లిలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి కోరారు. బుధవారం ఆమె మున్సిపల్ పరిధిలోని అడ్లూర్, ఇల్చిపూర్, రామేశ్వరపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. పట్టణం ఇప్పటికే అభివృద్ధి పథంలో ఉందని, కేసీఆర్ వస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో 100 శాతం అభివృద్ధి జరుగుతుందని హామీ ఇచ్చారు. కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కౌన్సిలర్లు గడ్డమీదిరాణి, సుతారిరవి, నాయకులు పాల్గొన్నారు.

'విశ్రాంత ఉద్యోగులు మద్దతు ఇవ్వండి'

- ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి



సుభాష్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న విఠల్

కామారెడ్డి అర్బన్: విశ్రాంత ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి కోరారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లా సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో షేరి సుభాష్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు వయో పరిమితి 58 నుంచి 61 సంవత్సరాల పెంచారని, ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినందుకు కేసీఆర్‌ను గెలిపించాలని వారు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్ రావు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సుభాష్‌రెడ్డికి అందజేశారు. సంఘం ప్రతినిధులు గంగాగౌడ్, మల్లేషం పాల్గొన్నారు.

దోమకొండలో గంప శశాంక్ ప్రచారం



దోమకొండ: సీఎం కేసీఆర్ గెలుపుతో కామారెడ్డి ప్రాంతం మరింతగా అభివృద్ధి సాధిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర యూత్ నేత గంప శశాంక్ అన్నారు. బుధవారం దోమకొండలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, చాముండేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



రాజంపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



భిక్కనూరులో ..

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నేతలు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు ఓటేసి గెలిపించి అభివృద్ధిలో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలబెట్టాలని వారు కోరారు. నేతలు పోగుడ శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్, లక్ష్మణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తేవాలని ఓటర్లను కోరారు.

'నేను కాంగ్రెస్‌లో చేరలేదు'

మాచారెడ్డి: తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదని మండలంలోని బండ రామేశ్వరపల్లి గ్రామ సర్పంచ్ బాశెట్టి మీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు జరిగిన ప్రచారం అవాస్తవమని కొట్టిపారేశారు.

జియో ఇన్ఫర్మాటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్తు



భిక్కనూరు: జియో ఇన్ఫర్మాటిక్స్‌ను అభ్యసించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో జియో ఇన్ఫర్మాటిక్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. జియో ఇన్ఫర్మాటిక్స్ వల్ల వరదలను అరికట్టవచ్చన్నారు. ఉన్నతమైన ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. జియో ఇన్ఫర్‌మాటిక్స్ విభాగం ప్రొఫెసర్ నారాయణ గుప్తా, హాస్టల్ వార్డెన్లు సునీత, యాలాద్రి, ఏపీఆర్‌వో సరిత, అధ్యాపకులు నరసయ్య, నిరంజన్‌శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో యోసెఫ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల హక్కులపై ఎంఈవో యోసెఫ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు చిన్నతనంలో బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. బాలలను వేధిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి సంతోష్, ఉపాధ్యాయులు నిత్యజీవలత, నరేందర్, జైపాల్‌రెడ్డి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎలుపుగొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్ ఇటీవల బదిలీపై మాచారెడ్డి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా వెళ్లారు. బుధవారం ఎలుపుగొండలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు అయనను శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం రేణుక, విద్యా కమిటీ చైర్మన్ బాబులు, ఉపాధ్యాయులు పద్మ, శివలింగం, సత్యనారాయణలు ఉన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ఇంటిపన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులను చేపట్టాలన్నారు. గ్రామాల్లో చేపట్టే నూతన ఇళ్ల నిర్మాణాలు, ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వడం, తదితరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానికంగా ఉండి సేవ చేస్తా..



మహిళలతో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు



కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్ సౌందర్య

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): చేతి గుర్తుకు ఓటేసి గెలిపిస్తే స్థానికంగా ఉండి ప్రజలకు సేవ చేస్తానని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం ఆయన లింగంపేట మండలం మోతె, బూరుగిద్ద, గాంధీనగర్, ఎల్లారం, ముస్తాపూర్, కొయ్యగుండుతండా, ఒంటర్‌పల్లి, సూరాయిపల్లి, పోతాయిపల్లి, కోమట్‌పల్లి, తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కూడళ్లలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా అయిన నుంచి ప్రతి నెలా వచ్చే జీతం పేదలకే ఖర్చు చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామన్నారు. ధరణిలో లోపాలను సరిచేస్తామన్నారు. కాంగ్రెస్ వస్తే రైతుల కష్టాలు తీరుతాయన్నారు. 119 నియోజకవర్గాల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గమే వెనుకబడి ఉందన్నారు. దీనికి ఎమ్మెల్యే జాజాలనే కారణమన్నారు. ప్రతీ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/సదాశివనగర్: నాగిరెడ్డిపేట మండలం చీనూర్ గ్రామ సర్పంచ్ మాసగల్ల సౌందర్య, ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నారాగౌడ్, సదాశివనగర్ మండలంలోని ధర్మారావ్‌పేట్‌కు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ నామాల శంకర్‌తో పాటు పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నిరుపేదలకు ఉపయోగపడేలా మేనిఫెస్టో

- అభివృద్ధిని చూసి ఓటు వేయండి
- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): బీఆర్‌ఎస్ మేనిఫెస్టో నిరుపేదలకు ఉపయోగపడేలా ఉందని, మా పథకాలు ప్రతి గడపకు చేరాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. బుధవారం శాంతాపూర్, సీతారాంపల్లి, రాజాపూర్, దడ్గి తదితర గ్రామాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు చేసిన అభివృద్ధి, నేను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. కొత్త మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు కరువు

జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలకు స్థానికంగా అభ్యర్థులు దొరకలేదని, ఎక్కడి నుంచో వచ్చిన వారికి టికెట్ కేటాయించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, నాయకులు నాల్చర్ రాజు, అసద్ అలీ, కలీం పటేల్, వెంకట్‌రావు, రాజాగౌడ్, పురుషోత్తంరెడ్డి, గంగారెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

జాజాల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు



ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పెసరి సాయిలు, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ పాల్గొన్నారు.

సీఎం సభకు ర్యాలీగా తరలిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో నిర్వహించిన సీఎం బహిరంగ సభకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ బుధవారం జనాలతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. పట్టణంలోని ఎమ్మెల్యే ఫాంహౌజ్ నుంచి బహిరంగ సభ స్థలం వరకు వేలాది మంది జనాలతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ రాజు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంసీసీ కోడ్ కమిటీ ఆధ్వర్యంలో బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ప్రచార రథాలు, వాహనాలు, డబ్బు, వస్తువుల పంపిణీ చేసినా తెలియజేయాలన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే సమాచారం అందివ్వాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, ఓటరు స్లిప్పులు 17 నుంచి 21 లోపు ఇంటింటికి అందించాలన్నారు. ఎంపీడీవో రాము, కార్యదర్శులు నవీన్, మానస, సాయిలు, యోగి, అనిల్, తదితరులున్నారు.

వడ్డెర వృత్తిదారుల సంఘం కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి రూరల్: తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల నర్సింలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దండుల బాలయ్య ఆధ్వర్యంలో మండలంలోని నర్సన్నపల్లి వడ్డెర వృత్తిదారుల గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దండుగుల రమేష్, గౌరవ అధ్యక్షుడిగా దండుల లస్మయ్య, ఉపాధ్యక్షుడిగా బండారి నర్సింలు, కోశాధికారిగా దండులు రవి, ప్రధాన కార్యదర్శిగా దండుగుల సురేష్, సహాయ కార్యదర్శిగా దండుగుల నరేష్‌లు ఎన్నికయ్యారు.